సాక్షి
పల్నాడు

ఆదివారం ∙ 28 ∙ జూలై ∙ 2024



పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయానికి శనివారం ముఖద్వార ఏర్పాటుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



డీజీపీని కలిసిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావును మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

నేడు మహాలక్ష్మమ్మ తిరునాళ్ల



దాచేపల్లి : ప్రజల కొంగు బంగారమైన మహాలక్ష్మమ్మ తిరునాళ్ల ఆదివారం జరగనున్నది. ఈ సందర్భంగా శనివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

వినుకొండ నుంచి మహానందికి ప్రత్యేక బస్సు

వినుకొండ(నూజెండ్ల):వినుకొండ డిపో నుంచి మహానంది, యాగంటి, అహోబిలం, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, సిద్ధయ్య మఠం యాత్రకు ప్రత్యేక బస్సును ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరనాయక్ తెలిపారు. ఆగస్టు 9వ తేదీ సాయంత్రం 9 గంటలకు వినుకొండ నుంచి బస్సు బయలుదేరి 10వ తేదీ ఉదయం మహానంది చేరుకొని దర్శనం చేసుకొంటారు. అక్కడి నుంచి 11 గంటలకు యాగంటి చేరుకొని సాయంత్రం అహోబిలం తరువాత రాత్రికి ఒంటిమిట్ట చేరుకుంటారన్నారు. 11వ తేదీ ఉదయం రాములవారి దర్శనం చేసుకొని మధ్యాహ్నానికి బ్రహ్మంగారి మఠం, సిద్ధయ్య గారి మఠాలను దర్శించుకొని 12వ తేదీ ఉదయం తిరిగి వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. టికెట్ ధర రూ.1500 ఉంటుందన్నారు. వివరాలకు 9949225431, 7382898320 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏబీఆర్ కాలేజీని సందర్శించిన విద్యా శాఖ కమిషనర్

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల న్యాక్ ప్లస్‌కు ఎంపికైన సందర్భంగా కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ శనివారం సందర్శించారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన న్యాక్ ప్లస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. తీర ప్రాంతం రేపల్లెలోని డిగ్రీ కళాశాల న్యాక్ ప్లస్‌కు ఎంపికకావడం అభినందనీయమన్నారు.

నవోదయలో రెండు రోజుల వైజ్ఞానిక ప్రదర్శన

చిలకలూరిపేట(యడ్లపాడు): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి...నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వైజ్ఞానిక పోటీలను ఏర్పాటు చేసినట్లు జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. సోమ, మంగళవారాల్లో నవోదయ విద్యాసమితి పరిధిలోని ఏడు ఉమ్మడి జిల్లాల స్థాయిలో క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. సైన్స్, సోషల్, మ్యాథ్స్, ఎస్‌యూపీడబ్ల్యూ, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ తదితర సబ్జెక్టులకు సంబంధించిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శితమవుతాయన్నారు. శ్రీకాకుళం నుంచి గుంటూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన జేఎన్‌వీ విద్యార్థులు హాజరై తాము తయారుచేసిన ప్రాజెక్టుల్ని ఈ పోటీలకు తీసుకువస్తారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీలను తిలకించేందుకు అనుమతినిచ్చినట్లు తెలిపారు. విజేతలు క్లస్టర్‌స్థాయి నుంచి జేఎన్‌వీ ప్రాంతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు.

నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు చర్యలు



బాపట్ల : నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని నల్లమడ డ్రెయిన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణ చర్యల్లో భాగంగా డ్రెయిన్ లాకులు మరమ్మతు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

హాస్టల్‌లో ఫోన్ ద్వారా స్పాట్ అడ్మిషన్

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా మురికిపూడి గ్రామంలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి కె. రాజాబాబు చెప్పారు. హాస్టల్‌లో ఎస్సీ -12, ఎస్టీ- 3, ఓసీ-4 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చన్నారు. ఫోన్ చేసి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఇందు కోసం ఫోన్ నంబర్ 74165 16599లో సంప్రదించాలన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరుఎడ్యుకేషన్: ఏపీ పాలిసెట్-2024 కన్వీనర్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఈనెల 31న అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్ ఈసీఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, సీఎస్ఈ బ్రాంచ్‌ల్లో సీట్లు భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు.

ఇసుక తోడేస్తున్నారు!

- టీడీపీ నేతల ఇష్టారాజ్యం
- అధికారికంగా వైకుంఠపురం రీచ్‌కు అనుమతి
- అనధికారికంగా మల్లాది, మునగోడుల్లో తవ్వకాలు
- రాత్రి పూట తవ్వకాలు..పగలు గప్‌చుప్
- పట్టించుకోని అధికారులు

తాము అధికారంలోకి వస్తే ప్రజలందరికీ ఉచితంగా ఇసుక ఇస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి రాగానే ఉచితం మాట పక్కన పెట్టి దోపిడీకి తెరతీశారు. అధికారికంగా ఒక్క రీచ్‌కు మాత్రమే అనుమతి ఇవ్వగా అనధికారికంగా మల్లాది, మునగోడు రీచ్‌లలో తవ్వకాలు చేస్తున్నారు కూటమి నేతలు. పగలు సైలెంట్‌గా ఉంటూ రాత్రిళ్లు ఇసుకను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



వైకుంఠపురంలో వాహనాలకు ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

అమరావతి:ప్రభుత్వం అధికారికంగా వైకుంఠపురం ఇసుక రీచ్ నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వగా మండల పరిధిలోని మల్లాది, మునగోడు ఇసుక రీచ్‌లలో నిర్వహిస్తున్నారు.

- మల్లాదిలో గతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతుండగా అధికారులు గుర్తించి 10 రోజుల కిందట రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా దారిలో పెద్దగాడి తీయించారు. ఇదిలా ఉంటే వారం రోజులుగా కూటమి నేతలు గాడి పూడ్చి రీచ్‌లోకి వెళ్లి రాత్రి పూట వాహనాలకు పొక్లెయినర్‌తో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. తెల్లావారేసరికి యథావిధిగా గాడితీసి ఉంచుతున్నారు. ఈ పద్ధతిలో రోజుకు సుమారు 50 నుంచి 100 ట్రాక్టర్ల ఇసుక బయటకు పోతున్నట్లు సమాచారం. ఇలా ఇసుక లోడ్ చేసినందుకు ట్రాక్టర్‌కు ఐదు వందల రూపాయలకు పైగా వసూలు చేస్తున్నారు.
- మునగోడులో పట్టపగలే ఇసుకను మనుషులతో లోడ్ చేయించి గ్రామంలో రెండు మూడు చోట్ల నిల్వ ఉంచారు. ప్రభుత్వ విధి విధానాలకు వ్యతిరేకంగా అక్రమంగా రీచ్‌లో ఇసుక తవ్వకాలు చేస్తున్న విషయం మైనింగ్ అధికారులకు, పోలీస్ అధికారులకు తెలిసిన చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

ఉచితం మాటున అక్రమ వసూళ్లు

మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుకరీచ్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఉచిత ఇసుక పథకం ద్వారా ఈనెల 8వ తేదీ నుంచి ఇసుక రవాణా ప్రారంభించారు. గతంలో డంప్ చేసిన 64,467టన్నుల ఇసుకను సక్రమ పద్ధతిలో లోడ్ చేయటానికి రెవెన్యూ శాఖ నుంచి వీఆర్వోను, క్యూ పద్ధతి అమలు చేయటానికి పోలీసు సిబ్బందిని నియమించారు. ఈ క్రమంలో ఇసుక రీచ్‌లో కొంత మంది అధికార పార్టీకి చెందిన వారు అక్రమ వసూళ్లకు తెరతీశారు. ఇసుక అవసరమైన వినియోగదారుడు తెస్తే ఆధార్ కార్డుతో మాత్రమే బిల్లులు రాస్తున్నారు. అక్రమార్కులు ఇతరుల ఆధార్ కార్డులు తెచ్చి బిల్లులు నమోదు చేయిస్తున్నారు. ముందు వచ్చిన వారికి ముందు అనే పద్ధతికి విరుద్ధంగా అధికార పార్టీ వారికి ఒకేసారి 5 లేక 10 బిల్లులు రాస్తున్నారు. ఈ బిల్లులను లారీ యజమానులకు ఇచ్చి అదనంగా వారి నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. ఈ పద్ధతి కొనసాగటానికి కొందరు వీఆర్వోలు సహకరించినట్లు సమాచారం.

అధికారుల ఎదుట వాహనదారుల ఆవేదన

గత గురువారం సాయంత్రం సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ వైకుంఠపురం ఇసుకరీచ్ పరిశీలనకు వచ్చినప్పుడు లారీ డ్రైవర్లు, యజమానులు, గ్రామస్తులు తాము వాహనాలు పెట్టుకుని గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ రోజుకు ఒక్క ట్రిప్ కూడా వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదనంగా రూ.1000 చెల్లించి బిల్లులు రాయించుకున్న వారు రోజుకు రెండు నుంచి మూడు ట్రిప్‌లు తోలుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఆర్డీవో మురళీకృష్ణ రికార్డులు పరిశీలించి ఇటువంటి తప్పులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చి వెళ్లారు.



స్టాక్ పాయింట్‌లో బారులుతీరిన వాహనాలు

చర్యలు శూన్యం

అక్రమాలపై ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలు రోజుకు ఒకరు చొప్పున వైకుంఠపురం ఇసుక రీచ్‌లో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వైకుంఠపురం రీచ్‌లో శుక్రవారం నుంచి గతంలో మాదిరి రూ.1000 అదనంగా తీసుకుని బిల్లులు రాయించటం మానేసి నేరుగా లారీ యజమానుల వద్ద రూ.500 వసూలు చేస్తున్నట్లు సమాచారం.

అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు

మండలంలోని ఇసుక రీచ్‌లలో ఎటువంటి అక్రమ తవ్వకాలు జరగకుండా రెవెన్యూ, పోలీసుశాఖ సమన్వయంతో రాత్రి పూట డ్యూటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వైకుంఠపురం ఇసుక రీచ్‌లో అధికంగా డబ్బు వసూళ్లు చేస్తున్నట్లు వచ్చిన అభియోగాలపై విచారణ జరుపుతున్నాం. ప్రస్తుతం రీచ్‌లోకి రెవెన్యూ సిబ్బంది కాకుండా బయటి వ్యక్తులు రావటాన్ని నిషేధించాం. ఈ నిషేధాన్ని అమలు చేయటానికి పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని రీచ్‌లోకి లారీకి సంబంధించిన డ్రైవర్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

–సునీత డిప్యూటీ తహసీల్దార్, అమరావతి మండలం

ర్యాగింగ్ కేసులో ఐదుగురి అరెస్ట్

- పరారీలో మరో నిందితుడు
- ర్యాగింగ్‌తోపాటు అట్రాసిటీ చట్టం వర్తింపు

నరసరావుపేటటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ ఘటన కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేశారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేయగా శనివారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల బాలుర హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థి సీహెచ్. పాల్ థామస్‌పై సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ పేరుతో పైశాచికంగా దాడికి పాల్పడిన విషయం విదితమే. దాడులకు సంబంధించిన వీడియో వెలుగులోకి రావటంతో సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటివరకు వసతి గృహంలో ఎన్నో ఏళ్లుగా చీకట్లో జరుగుతున్న ర్యాగింగ్ రక్కసి ఒక్కసారిగా బయటపడినట్టయింది. బాధితుడి ఫిర్యాదుతో సీనియర్ విద్యార్థులు సత్తెనపల్లి గోపికృష్ణ, దర్శి చెందు, రమావత్ అంజినాయక్, యారగాని అజయ్‌కుమార్, యనమల నరేంద్రరెడ్డి, అజయ్‌లపై ఈనెల 24వ తేదీన కేసు నమోదు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించటంతోపాటు కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టాయి. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ స్వయంగా కళాశాల హాస్టల్‌కు వెళ్లి ర్యాగింగ్ ఘటనపై ఆరా తీశారు. ఎన్‌సీసీ ఉన్నతాధికారులు సైతం సంఘటనపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు. ఈక్రమంలో కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు నిందితుల అరెస్ట్, కేసు పురోగతికి అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతిని నియమించారు. దీంతో ఆయన పర్యవేక్షణలో బాధితుడు దళిత సామాజిక వర్గీయుడు కావటంతో కేసులో అట్రాసిటీ చట్టాన్ని జోడించారు. ర్యాగింగ్ ఘటనలో కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ ఆఫీసర్, వార్డెన్ ప్రమేయంపై అంతర్గత విచారణ చేస్తున్నట్టు సమాచారం.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య భాగ్యం

పురుగుమందులు, ఎరువుల వాడకం పెరిగింది. దీంతో సారవంతమైన భూమి నిస్సారమవుతుంది. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. వీటన్నింటికి చెక్ పెట్టడమే లక్ష్యంగా వ్యవసాయ అధికారులు ప్రణాళిక రచించారు. ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేసేలా రైతన్నను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో ప్రకృతి సేద్యం ఆశాజనకంగా ముందుకు సాగుతోంది.



- పురుగుమందులు లేని ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి
- పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేలా చర్యలు
- సాగు పెరిగేలా ప్రకృతి సేద్య సిబ్బంది ప్రణాళిక
- 2024-25 ఏడాదిలో 52వేల ఎకరాల సాగు లక్ష్యం



ప్రకృతి సేద్యంలో సాగవుతున్న మొక్కజొన్న పంట

నరసరావుపేట రూరల్: జిల్లాలో రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. పంటల సాగుకు సహకారం అందిస్తూ వ్యవసాయ పరంగా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు అందరూ కృషి చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పిస్తూ ఏటేటా ప్రకృతి వ్యవసాయ సాగును జిల్లాలో విస్తరింపచేస్తున్నారు. దీంతోపాటు పండ్ల తోటలు, కూరగాయల పంటలు, ప్రధాన పంటల్లో అంతర పంటలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

జిల్లాలో 28మండలాల పరిధిలో...

జిల్లాలో 28 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 52 వేల ఎకరాల్లో వరి, పత్తి, మిరప, జొన్న, శనగ పంటలను ప్రధానంగా సాగుచేస్తున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాల పంటల సాగు చేస్తే భూమికి అవసరమయ్యే పోషకాలు పెరిగే అవకాశం ఉండటంతో ఈ పద్ధతిపై వ్యవసాయ విభాగం దృష్టి సారించింది. ఫలితంగా వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం పర్యవేక్షణలో జిల్లాలో 305 రైతుభరోసా కేంద్రాల పరిధిలో 222 గ్రామాల్లో 1074 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు వివిధ పంటల సాగులో రసాయన ఎరువులను మోతాదుకంటే అధికంగా వాడటం వలన భూసారం కోల్పోయి క్రమేపి పంట దిగుబడి శాతం తగ్గిపోతుంది. దీనికి తోడు ఒకే పంటను సాగుచేస్తుంటడంతో పొలాల్లో పోషకాల అసమతుల్యత ఏర్పడింది. ఇటువంటి తరుణంలో నవధాన్యాల పంటల సాగు భూసారాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించనున్నాయి. వీటి సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు మొక్కకు అందిచడంతో పాటు నేల భౌతిక లక్షణాలు మెరుగుపడి నేల ఆరోగ్యం కాపాడుతాయి. దీంతో ప్రస్తుతం జిల్లాలో చాలా మంది రైతులు ప్రధాన పంటలకు ముందుగా నవధాన్య పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 47వేల నవధాన్య కిట్లను 39వేల మంది రైతులకు పంపిణీ చేశారు. దాదాపు40 వేల ఎకరాల్లో నవధాన్య పంటలను ఈ ఏడాది సాగు చేయనున్నారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా జులై చివరి వరకు ఈ నవధాన్య పంటల సాగు మరింత విస్తీర్ణంలో చేయనున్నారు.

2024-25 సంవత్సరంలో పంటల సాగు లక్ష్యం

సాగయ్యే పంటలు	రైతుల సంఖ్య	విస్తీర్ణం ఎకరాల్లో
వరి (బోర్ల క్రింద)	6330	8643
వరి (ఎన్ఎస్‌పి కాలువ)	6661	4507
పత్తి	19,483	23,317
మిరప	13,421	13,750
ఇతర పంటలు	3626	1783
మొత్తం	49,521	52,000

నవధాన్య పంటల సాగుతో ప్రయోజనాలు ఇలా..

- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు లభ్యమవుతాయి
- సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది.
- ఏడాది పొడవునా భూమిలో పైరు ఉంటుంది. నేల చీలిపోకుండా ఉంటుంది.
- నవధాన్యాల సాగుతో వేళ్ల మధ్య సంపర్కం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు తయారవుతాయి.
- నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది.
- ప్రధాన పంటల సాగులో చీడపీడలు ఆశించవు.
- జీవన వైద్యంలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఉత్పత్తి అవుతాయి.
- పైరుకు మేలు చేసే సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి.
- నవధాన్య పంటలను పొలంలో కలియదున్నడం వల్ల బాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది.
- నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి వేరు వ్యవస్థ బలపడి గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది.

లక్ష్యం మేర సాగుకు కృషి

ప్రకృతి సేద్యంలో భాగంగా జిల్లాలో 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లకు 49,521 మంది రైతులతో 52వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు లక్ష్యంగా నిర్దేశించాం. ఈ మేరకు ప్రకృతి సిబ్బందితో కలిసి లక్ష్య సాధనకు కృషిచేస్తాను.

– కె.అమలకుమారి, ప్రకృతి వ్యవసాయం, జిల్లా ప్రాజెక్ట్ అధికారి

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కలెక్టరేట్ సమీక్షలో అధికారులను వివరాలు అడుగుతున్న జిల్లా కలెక్టర్

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- పీఆర్ వన్ యాప్‌పై సమీక్ష

నరసరావుపేట: జిల్లాలో పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం పీఆర్ వన్ యాప్‌పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన పీఆర్ వన్ యాప్ ద్వారా జిల్లాలో పారిశుద్ధ్య పరిస్థితులను పర్యవేక్షిస్తామన్నారు. ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు యాప్ గురించి సంపూర్ణ అవగాహన తెచ్చుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను యాప్‌లో నమోదు చేసే పని ఆదివారం సైతం కొనసాగించాలని ఆదేశించారు. యాప్ నమోదులో వెనుకబడిన మండలాల అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. డీపీఓ ఎం.విజయభాస్కర్‌రెడ్డి, నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి డీఎల్డీఓలు వెంకట్‌రెడ్డి, గఫూర్ నాయక్, రాజగోపాల్, డీపీఆర్వో ఓంప్రకాశ్‌రెడ్డి, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాలు నడపొద్దు

నగరంపాలెం:రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నడపొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, తూర్పు ట్రాఫిక్ పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మోటారు వాహనాల చట్టాలపై, అవగాహనా సదస్సు, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.అనిత పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో అద్భుత ఫలితాలు సాధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, క్రీడాకారులు, శిక్షకులు

లక్ష్మీపురం: పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అద్భుత ఫలితాలు సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో భారతదేశ పతాకాన్ని మరింత ఎత్తుకు ఎగురవేసేలా కృషి చేయాలన్నారు. ఒలింపిక్స్ క్రీడా పోటీలకు వెళ్లిన వారి వెంట ప్రతి ఒక్క భారతీయుడు ఉన్నారని అన్నారు. అదే విధంగా దేశ వ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించాల్సిందిగా పేర్కొన్నారు. ఈ ర్యాలీలో క్రీడాకారులు, స్థానికులు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీకి విద్యార్థుల ఎంపిక



క్రోసూరు: అగస్టు 17, 18, 19 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీకి స్థానిక సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ రజిత తెలిపారు. ముగసపాడులో శనివారం జరిగిన ఎంపికల్లో విద్యార్థులు పఠాన్ ఇబ్రహీం ఖలీల్, గుంటూరు తనూజ, కంభంపాటి దీవెన ఏంజల్, కారుమంచి పూజిత ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం, పీఈటీ ఉపాధ్యాయుడు వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

గ్రామీణాభివృద్ధి శాఖ
జాయింట్ కమిషనర్ అశోక్ కుమార్



నరసరావుపేట రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం.అశోక్ కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో శనివారం ఉద్యాన శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరుపై అధికారులతో చర్చించారు. జిల్లాలో ఐదువేల ఎకరాల్లో ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటల సాగు లక్ష్యాన్ని విధించారు. రైతుల ఆర్థికాభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పండ్ల తోటలకు అనువైన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వివరించారు. ఇందుకోసం అనుబంధ శాఖల సహకారం తీసుకోవాలని తెలిపారు. డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ రమణారెడ్డి, ఏపీడీలు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు పాల్గొన్నారు.

దోమల లార్వా నిర్మూలనకు ఆయిల్‌బాల్స్



నరసరావుపేట: వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టణంలోని సీబీఎస్ కాలనీలో నీటి మడుగులో శనివారం ఆయిల్ బాల్స్‌ను వదిలారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి మాట్లాడుతూ జూన్ నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా పలుచోట్ల నీటి మడుగులు ఏర్పడ్డాయన్నారు. వీటిలో దోమ లార్వా వృద్ధి చెందుతోందని చెప్పారు. దోమల గుడ్లు నుంచి వచ్చే లార్వాలు తొమ్మిది, పది రోజుల్లోనే దోమలుగా మారతాయన్నారు. ఈ దశలోనే చంపేందుకు ఈ ఆయిల్ బాల్స్ ఉపయోగపడతాయని వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హనుమకుమార్, ఏఎంవో సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్‌యూఓ కొల్లిపర శ్రీనివాస్, సబ్‌యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

'అడవి వెలుపల చెట్లు'తో పర్యావరణ పరిరక్షణ

– డీఎఫ్‌ఓ ఎస్.రామచంద్రరావు



అడవి వెలుపల చెట్లు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారులు

నరసరావుపేట రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం అడవి వెలుపల మొక్కల పెంపకం కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.రామచంద్రరావు తెలిపారు. వినుకొండ రోడ్డులోని రోటరీ క్లబ్ హాల్‌లో శనివారం మాస్టర్ ట్రైనర్‌లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ రామచంద్రరావు, వ్యవసాయ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులు డాక్టర్ ఐ.మురళీ, సీహెచ్ రమణారెడ్డి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ హనుమాన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. రోజురోజుకు తగ్గిపోతున్న అడవుల విస్తీర్ణంతో పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. అడవుల ద్వారానే ఇది సాధ్యం కాదని, అడవి వెలుపుల కూడా పెద్ద ఎత్తున చెట్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖలు, డీఆర్డీఏ, ఏజీవోలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు. అనుకూలమైన మొక్కల జాతులు, అటవీ నిబంధనలు, కార్బన్ క్రెడిట్లు గురించి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ అందిస్తున్నారు. వీరు గ్రామ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ హనుమాన్ నాయక్ తెలిపారు. ప్రతి మాస్టర్ ట్రైనీ మండలంలో రైతులకు అగ్రో ఫారెస్ట్రీపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఐదువేల మంది రైతులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీవోఎఫ్‌ఐ ప్రోగ్రాం రాష్ట్ర కో–ఆర్డినేటర్ అజిత్, ఎం.ప్రణీత్ వర్మ పాల్గొన్నారు.

ఒకరిని కొట్టే హక్కు ఎవరిచ్చారు

ర్యాగింగ్ ఘటనపై న్యాయమూర్తి మధుస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి మధుస్వామి

నరసరావుపేట ఈస్ట్: 'ఒకరికి మరొకరిని కొట్టే హక్కు ఎవరిచ్చారు..? ఒకరిని హింసిస్తూ.. వారు బాధపడుతుంటే నవ్వుకోవడం సరదాగా చేసిన పనా..? అది ఎన్‌సీసీయేనా..' అంటూ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ విభాగం విద్యార్థుల ర్యాగింగ్ వీడియోను ఆయన తీవ్రంగా ఖండించారు. సీనియర్ క్యాడెట్స్ తమ జూనియర్స్‌పై జరిపిన దాడిని తప్పుబట్టారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆడిటోరియంలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మధుస్వామి మాట్లాడుతూ ఒకరిని హింసిస్తూ దానిని వీడియో తీసి వైరల్ చేయడం అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. తాము సరదాగా వీడియో తీసుకున్నామని విద్యార్థులు చెప్పినప్పటికీ.. ఆ వీడియో చూసిన వారికి వాస్తవం అర్థమవుతోందన్నారు. ర్యాగింగ్ నిరోధక చట్టం–1997 ప్రకారం వారు న్యాయ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని జడ్జి స్పష్టం చేశారు. ర్యాగింగ్ ఘటన విచారణ స్థాయిలో ఉండటం వల్ల దానిపై తాము మాట్లాడకూడదన్నారు. విద్యార్థులు ఎవరైన ర్యాగింగ్, అసమానతలకు గురైతే.. వారికి న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సాయం అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు టి.అమూల్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఇంటెన్సీవ్ క్యాంపస్ ఇన్చార్జి డాక్టర్ ఎం.ఎస్ సుధీర్ పాల్గొన్నారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

విచారణ చేపట్టిన ఏఎస్పీ లక్ష్మీపతి



విచారణకు వచ్చిన అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ బలరామ్‌రెడ్డి

నాదెండ్ల: బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించిన ఘటనపై అధికారులు స్పందించారు. గణపవరంలో శుక్రవారం రాత్రి ఓ బాలికతో అదే ప్రాంతంలో చికెన్ దుకాణంలో పనిచేసే అరవై ఏళ్ల వయసున్న షేక్ మౌలాలి అలియాస్ అహ్మద్ అలీ అసభ్యంగా ప్రవర్తించాడు. తనను దుకాణంలోకి తీసుకెళ్లి దుస్తులు విప్పి అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో.. వారు ఆ వృద్ధుడిని నిలదీశారు. దీంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, బాలికకు శనివారం చిలకలూరిపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించారు. ఈ ఘటనపై పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ, నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి స్పందించారు. గణపవరం గ్రామానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి, వివరాలు నమోదు చేసుకున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో దర్యాప్తును ముమ్మరంగా చేస్తున్నారు. వారి వెంట చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, నాదెండ్ల ఎస్సై జె.బలరామ్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబంతో బాలల సంరక్షణ అధికారులు

జిల్లా బాలల సంరక్షణ అధికారి శౌరిరాజు, కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతకుమారి బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్‌ను సంప్రదించారు. గతంలో ఇలాంటి ఘటనలు గ్రామంలో ఎన్నడూ జరగలేదని, ఇదే మొదటిసారి అని స్థానిక మహిళలు వారికి వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పార్వతి, అంగన్‌వాడీలు ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



విజయపురిసౌత్: మాచర్ల మండలం తాళ్లపల్లి వద్ద నాగార్జున సాగర్ కుడి కాలువలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం 30వ వార్డుకు చెందిన శెట్టి గోపి (32) గుంటూరు మిర్చి యార్డులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం తన స్నేహితులతో కలిసి కారులో నాగార్జున సాగర్ విహార యాత్రకు వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో తాళ్లపల్లి వద్ద కారు ఆపి, గోపి ఒక్కడే కాల్వవలో ఈతకు దిగాడు. స్నేహితులు వారిస్తున్నా వినలేదు. నీటి ప్రవాహం ఉధ్రుతంగా ఉండటంతో గల్లంతయ్యాడు. విజయపురిసౌత్ ఎస్సై పట్టాభిరామయ్య తన సిబ్బందితో గాలింపు చేపట్టగా గోపి మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాచవరంలో డయేరియాపై డీఎంహెచ్‌ఓ పరిశీలన



మాచవరం: మండల కేంద్రమైన మాచవరం గ్రామాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజు శనివారం సందర్శించారు. డయేరియాతో గ్రామస్తులు పలువురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండటంతో ఆయన గ్రామంలో పర్యటించి, పరిసరాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. డయేరియా బారిన పడిన పలువుర్ని పరామర్శించి, వైద్య చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాదరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఇంజక్షన్ వికటించి రోగి మృతి



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం బుర్రిపాలెంలో ఓ ఆర్‌ఎంపీ చేసిన ఇంజక్షన్ వికటించి ఓ రోగి మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఆందోళనకు దిగారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తాటి శ్రీను (28) తన కాలుకి గడ్డ రావడంతో రవ్వవరంలోని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు చికిత్స నిమిత్తం వెళ్లాడు. అతను ఆపరేషన్ చేసి, రోగి కాలిపై ఉన్న గడ్డ తొలగించాడు. దీంతో శ్రీనుకు కాలు వాచి తీవ్రంగా నొప్పి రావడంతో ఆర్‌ఎంపీ ఇంజక్షన్ చేశాడు. అది కాస్త వికటించి శరీరంపై దద్దులు వచ్చి శ్రీను వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. మార్గ మధ్యలో అతను మృతి చెందాడు. ఫస్ట్ ఎయిడ్ చేయాల్సిన ఆర్‌ఎంపీ గడ్డకు ఆపరేషన్ చేసి, ఇంజక్షన్ చేయడం వల్లే శ్రీను చనిపోయాడని, ఇందుకు బాధ్యుడైన ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

పడవల నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

అచ్చంపేట: కృష్ణానది తీర గ్రామాలైన చామర్రు, చింతపల్లి, గింజుపల్లి, తాడువాయి, మాదిపాడు గ్రామాల నుంచి నది మీదుగా ఆవలి ఒడ్డుకు పడవ నడుపుకునేందుకు.. మాదిపాడు వద్ద బల్లకట్టు ద్వారా భారీ వాహనాలను తరలించే హక్కు కోసం ఆగస్టు 7న టెండర్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ కుసుమ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లు గుంటూరు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో 7న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అదే రోజు 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.



నాగులేరు.. పట్టించుకునే నాథుడు లేడు

దాచేపల్లి: జీవ నదిగా పిలువబడే నాగులేరు తన ఉనికి కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు నాగులేరు తీరం వెంబడి ఉన్న గ్రామాలకు తాగు, సాగు నీరు అందించేది. కానీ ఇప్పుడది తన ఆకారాన్ని కోల్పోయి.. వికారంగా కన్పిస్తోంది. ప్రస్తుతం నాగులేరులో ఎక్కడ చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు నీటిపై పాచిపట్టి, గుర్రపు డెక్క అల్లుకుపోయింది. దీంతో నీరు ముందు కదలడం కష్టతరంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి, నాగులేరులో ఉన్న పాచి, గుర్రపు డెక్కను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



అద్దంకి బ్రాంచ్ కెనాల్ మరమ్మతులకు రూ.3 కోట్ల అంచనాలు

డీఈ చాట్రగడ్డ రామారావు



కెనాల్ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: అద్దంకి బ్రాంచ్ కెనాల్ అత్యవసర మరమ్మత్తులకు రూ.3 కోట్ల అంచనాలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు ఎన్‌ఎస్‌పీ డీఈ చాట్రగడ్డ రామారావు తెలిపారు. శనివారం మండలంలోని గంటావారిపాలెం సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో చేజర్ల నుంచి కారు మంచి వరకు 27 మేజర్లు ఉన్నాయన్నారు. యుద్ధ ప్రతిపదికన వీటి మరమ్మతులు చేయించడానికి ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు.. ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేసినట్లు వెల్లడించారు. కెనాల్ ఇరువైపులా భారీ స్థాయిలో ఉన్న ముళ్ల చెట్లు, మేజరు కాల్వలో పూడిక తీత తొలగింపు చేపడితేనే చివరి భూముల వరకు సాగునీరు సరఫరా అవుతుందన్నారు. కెనాల్ పరిధిలో 64 ఎకరాల సాగు భూమి ఉందని తెలిపారు. ఏగువ నుంచి వరద ఉధ్రుతి పెరిగితే శ్రీశైలం జలశయం గేట్లు ఎత్తి.. సాగర్ జలశయానికి వదులుతారన్నారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 1,350 క్యూసెక్కుల విడుదలవుతుందని, అందులో ప్రకాశం, బాపట్ల జిల్లాలకు 800 క్యూసెక్కులు కేటాయిస్తారని తెలిపారు. మిగిలిన సాగర్ జలాలు కెనాల్ పరిధిలో ఉన్నన తాగునీటి అవసరాల నిమిత్తం.. మంచి నీటి చెరువులు, కుంటలు వాగులు నూరుశాతం నింపడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు లస్కర్లు శేషకుమార్, బాలచంద్రం, కాంతయ్య ఉన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి పార్థసారథి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ వినియోగం, మోటార్ వాహనాల చట్టలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి, మండల లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి పాల్గొన్నారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్.సాంబశివరావు, రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐలు కృష్ణారావు, లక్ష్మీనారాయణరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఏ స్ఎస్‌వీ నాయుడు, సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు, చీమకర్తి బ్రహ్మం, ఎస్.కోటేశ్వరరావు, పీజే లూకా, పి.సైదారావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

మాచర్ల: తెలుగుదేశం పార్టీ నాయకులపై ఎన్ని ఎక్కువ కేసులుంటే వారికి అంత ప్రాధాన్యం కలిగే నామినేటెడ్ పదవులిస్తాననే.. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ప్రకటన అంబేడ్కర్ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ పేర్కొన్నారు. మాచర్లలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 55 రోజుల్లోనే హత్యలు, ఆత్మహత్యల ప్రేరణ, పేదల గృహాలు కూల్చివేత, దౌర్జన్యాలు, దమనకాండ, నడిరోడ్డులో హత్యలు చేయడం, ప్రజా ప్రతినిధుల గృహాలపైనా దాడులు చేసి.. తిరిగి బాధితులపైనే కేసులు పెట్టడం చూస్తే ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికి ఉందా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. శాంతిభద్రతలు కాపాడటమే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు బూటకాలేనన్నారు. వైఎస్సార్ సీపీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలే అండగా నిలబడి 40 శాతం ఓట్లు వేశారని గుర్తుచేశారు. వినుకొండ నడి రోడ్డులో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్ హత్య మరువక ముందే.. బొల్లాపల్లి మండలంలో గిరిజన నాయకుడుపై టీడీపీ శ్రేణులు శుక్రవారం దాడికి పాల్పడి, తీవ్రంగా గాయపరిచారన్నారు. మరసపెంటలో గిరిజనుల గృహాలు పాక్షికంగా, వారి ఆటో, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలు ధ్వంసం చేశారని చెప్పారు. దీనిని ఖండించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌ను సైతం టార్గెట్ చేస్తూ విమర్శలు చేయడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ ఆలోచనకు నిదర్శనమన్నారు.